క్లుప్తంగా

ఐటీబీపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిభారతి

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురంలో ఐటీబీపీ పంద లపాక 56వ బెటాలియన్ వైద్యురాలు సాయి భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన జీవనం కోసం గ్రామీణులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రశాంత్ ధార, గణపతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 11 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి ఈ నెల 3వ తేదీ నుంచి 14లోగా దరఖాస్తు చేసుకోవాలని పీవో శ్రీదేవి కోరారు. ఖాళీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాతపాలెం(ఓసీ), విజయరాంపురం(ఓసీ), వెంపాడవారి వీధి(ఎస్సీ గ్రూప్-3), కొయ్యపేట(ఎస్టీ), వేములవలస(ఎస్టీ), చిప్పాడ-1(ఎస్టీ), రౌతులపాలెం-1(ఎస్టీ), ముచ్చెర్ల(ఎస్టీ), పద్మనాభం(బీసీ ఇ), కోలవానిపాలెం(ఎస్టీ), భీమిలి గొల్లవీధి(ఈసీడబ్ల్యూ).

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



కార్యక్రమంలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు

భీమునిపట్నం: పారిశుద్ధ్య కార్మికులను భీమిలిలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఇక్కడి రెల్లివీధి వద్ద జరిగిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పాల్గొన్నారు. తొలుత ఒక రోజు ముందుగా మహాత్మాగాంధీ జయంతి నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చేసే పని ఎంతో గొప్పదని, దాన్ని అందరూ గుర్తించి వారిని గౌరవించాలని కోరారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది కూడా తమ విధులను బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య అధికారి బి.మహాలక్ష్మినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొమ్మాది: టీటీడీ లోకల్‌బాడీ సలహాదారుగా బోడె పట్టాభిరామ్ రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈ ఆలయానికి సమీపంలోనే, అదే సమయంలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన, ఇక్కడికి రాకపోవడం చర్చనీయాంశం అయింది.

పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. జోన్-2 పరిధి 5,6,7,8 వార్డుల్లో 12,358 మందికి రూ.5.48 కోట్లు పింఛన్లు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో లొడగల అప్పారావు, చెట్టిపిల్లి గోపి, శాకరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన

మధురవాడ: చంద్రంపాలెం దుర్గాలమ్మ పూర్వ గుడిలో నిర్వహించిన భారీ అన్న సమారాధనను దుర్గాలమ్మ ఆలయ ధర్మకర్త, ట్రస్ట్ చైర్మన్ పిళ్లా పాపారావు ప్రారంభించారు. చంద్రంపాలెం, కార్ షెడ్, సాయిప్రియ గార్డెన్, దుర్గానగర్ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 5వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

శక్తి స్వరూపిణి.. విజయరూపిణి

శక్తి స్వరూపిణి దుర్గామాత. మహర్నవమి వేళ అమ్మ మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. దుష్టశిక్షణ చేసి, శిష్టజనులను రక్షించే జగదంబను భక్తిశ్రద్ధలతో అర్చించారు భక్తులు. శరన్నవరాత్రి మహోత్సవాలతో వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు, మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. విజయాన్ని శుభాన్ని అందించే విజయదశమి పండగను వైభవంగా జరుపుకొనేందుకు నియోజకవర్గవాసులు సర్వం సిద్ధం చేశారు.



మహిషాసుర మర్దినిగా బబ్బేలమ్మ





విజయదుర్గ ఆలయంలో మహిషాసురమర్దినిగా.. చంద్రంపాలెం పూర్వ గుడి దుర్గాలమ్మ ఆలయంలో..

తగరపువలస: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగివలస ముగ్గురమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు వైభవంగా జరుగుతున్నాయి. దేవదాయ శాఖ నిర్వహించిన దుర్గా హోమం బుధవారం ముగియడంతో పూర్ణాహుతి సమర్పించారు. బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని, భీమిలి మండలం తాటితూరులో పైడితల్లమ్మను మహిషాసురమర్దినిగా అలంకరించారు.

పంచదార చిలకల అలంకరణలో..
3భీమిలి శివారులో అమ్మవారిని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పంచదార చిలుకలు, జరబర పువ్వులతో అలంకరించారు.



మహిషాసురమర్దిని అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ

నేటి నుంచి దసరా ఉత్సవాలు
ఆనందపురం మండలం వేములవలస శ్రీలక్ష్మి పైడితల్లమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండపం, అమ్మవారి విగ్రహాన్ని బుధవారం సిద్ధం చేశారు.

బబ్బేలమ్మ ఆలయంలో..
పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారు సప్త వర్ణాల గాజులు ధరించారు. అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

దుర్గాలమ్మ ఆలయంలో..
మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంతో పాటు పూర్వ గుడి దుర్గాలమ్మ ఆలయంలోనూ బుధవారం విశేష పూజలు చేశారు. పూర్వ గుడి దుర్గాలమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆలయ ధర్మకర్త, ట్రస్ట్ చైర్మన్ పిళ్లా పాపారావు కుటుంబ సభ్యులు హోమం నిర్వహించారు.



వేములవలస పైడితల్లమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సిద్ధమైన మండపం



సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో దుర్గాహోమం



మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో..

దుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సమర్పించిన సారె

కొమ్మాది: దుర్గమ్మకు బుధవారం సారె సమర్పించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి వంటకాలు, పండ్లు, వివిధ రకాల స్వీట్లు మొత్తం 108 రకాలను మహిళలు ఊరేగింపుగా తీసుకువచ్చి, సమర్పించారు. వీటిని అమ్మవారికి నివేదించి భక్తులకు ప్రసాదంగా అందజేయాలని ఉత్సవ నిర్వాహకులు సాకరి శ్రీనివాస్ కోరారు. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అమ్మవారి అలంకరణ చేశారు.

విజయదుర్గా దేవి ఆలయంలో చిన్న శ్రీను పూజలు



విజయదుర్గాదేవి ఆలయంలో పల్లకీ మోస్తున్న చిన్న శ్రీను, ఇతర నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ టైలర్స్ కాలనీలో కొలువుదీరిన విజయదుర్గాదేవిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) బుధవారం దర్శించుకున్నారు. స్థానిక నాయకులతో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. అమ్మ వారి ఘటాల ఊరేగింపు, పల్లకీ సేవలో పాల్గొన్న ఆయన అమ్మవారి పల్లకీ మోశారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్త బంగారు లక్ష్మి, సుబ్బారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ



పద్మనాభం జంక్షన్‌లో ట్రాక్టర్లతో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



వేములవలసలో రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

పద్మనాభం: వ్యవసాయ, అనుబంధ రంగ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుపై రెండు గ్రామాల్లో బుధవారం ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్ది జంక్షన్ నుంచి పద్మనాభం జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డి.శంకరరావు, భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ ప్రసాద్ మాట్లాడుతూ ట్రాక్టర్లతో ఆపటు టైర్ల వంటి విడిభాగాలు, డ్రోన్లపై 18 శాతం ఉన్న శాతం ఉన్న జీఎస్టీని 13 శాతం, 12 రకాల బయో పెస్టిసైడ్స్, ఆక్వా కల్చర్ పరికరాలపై 12 శాతం నుంచి ఏడు శాతం తగ్గించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.రూపేష్, ఏవో ఎంవీఎస్ చలం, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, కె.నగేష్ కుమార్, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన
తగరపువలస: జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై భీమిలి మండలం తాటితూరు సచివాలయం, ఆనందపురం మండలం వేములవలస వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యంత్ర పరికరాల ప్రదర్శన, ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. భీమిలి,ఆనందపురం ఏవోలు శివకోమలి, సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ వీటిని కొనుగోలు చేసే రైతులు జీఎస్టీ తగ్గినందున ధరలు కూడా బాగా తగ్గినట్టు గుర్తుంచుకోవాలన్నారు. ట్రాక్టర్ విడిభాగాలపై 13 శాతం, బిందు, తుంపర సేద్యం పరికరాలపై 7 శాతం అన్నిరకాల వ్యవసాయ అనుబంధ రంగాల వస్తువులు, పనిముట్లుపై 5 శాతం జీఎస్టీ తగ్గిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, జిల్లా ఉద్యానవనశాఖాధికారి శ్యామల, సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, ఎంపీడీవో నరసింహారావు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పశుసంవర్ధకశాఖ జేడీ శంకరరావు, ఏపీ ఎంఐపీ పీడీ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల కోలాటం

పీఎం పాలెం: దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా తెలుగునాట అంతటా మార్మోగుతున్న రఘుకుల తిలకా రారా .. గీతానికి చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యం హైలెట్‌గా నిలిచింది. వినాయక కౌతం.. ప్రణవాలయం.. అన్నమయ్య కీర్తనలకు కూచిపూడి నృత్యం ప్రదర్శించగా, ఘల్లు ఘల్లు..., అబ్బ వద్దు..., రాజాం కొండమీద..., దసరా వచ్చిందయ్యా.. తదితర గీతాలకు జానపద నృత్యం ప్రదర్శించి కళాకారులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. డి. మీనా నృత్య దర్శకత్వంలో కళాకారులు బిందుశ్రీ,యోగిని, లక్ష్మీ ప్రియ, కుసుమ, సంకీర్తన, ప్రత్యూష, కల్పనా, శరణ్య తదితర చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.



శిల్పారామం కళావేదిక పై కోలాట నృత్యం చేస్తున్న చిన్నారులు

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులో సరస్వతీదేవి మహోత్సవాలలో భాగంగా శాలివాహన యువజన సేవాసంఘం బుధవారం సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో చింతల వరలక్ష్మి, తాటిపూడి హేమలత, తాటిపూడి గ్రీష్మ వరుసగా మూడు బహుమతులు గెలుచుకున్నారు. వీరికి శిరిగుడి ఈశ్వరరావు, మద్దిల పాపారావు, తాటిపూడి వెంకటరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో శాలివాహన యువజన సేవాసంఘం ప్రతినిధులు తాటిపూడి రమణ, కొండలరావు, త్రినాథ్, రామకృష్ణ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లా సర్వీస్ రోడ్లు

తగరపువలస: కుండపోత వానకు సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా టి.నగరపాలెం వద్ద ఇరువైపులా సర్వీస్ రోడ్లు చెరువులను తలపించాయి. జీవీఎంసీ పరిధిలో సబ్బివానిపేట, వలందపేట, మండలంలో తాళ్లవలస, ఆనందపురం మండలంలో వెల్లంకి, పెద్దిపాలెం, శొంఠ్యాం, దుక్కవానిపాలెం, గుడిలోవ, మిందివానిపాలెం సర్వీస్‌రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. భారీ వాహనాలు సైతం ఈ నీటిలో మొరాయించాయి. జాతీయరహదారుల పైనుంచి కూడా వర్షంనీరు జలపాతాల మాదిరిగా ప్రవహించి వాహనదారులకు ఇబ్బంది కలిగించాయి. నీళ్లకుండీల నుంచి పద్మనాభం మీదుగా విజయనగరం వెళ్లే రహదారిపై కూడా నీరు ప్రమాదకరంగా ప్రవహించింది.



వెల్లంకి సర్వీస్ రోడ్డును ముంచిన వర్షం నీరు

దశమి మార్కెట్‌కు వర్షం ఎఫెక్ట్



బుధవారం ఉదయం తగరపువలస మార్కెట్‌లో అంతంతమాత్రంగా ఉన్న కొనుగోలుదారులు

తగరపువలస: దశమి మార్కెట్‌ను వర్షం దెబ్బ కొట్టింది. గత నెలలో వినాయకచవితి ముందు రోజు వర్షం కురిసినట్లే ఇప్పుడు విజయదశమి ముందు రోజైన బుధవారం కుండపోత వర్షం కారణంగా వ్యాపారాలు దారుణంగా పడిపోయాయి. ఆనందపురం, తగరపువలస మార్కెట్‌లతో పాటు పలు గ్రామాలు జలమయమై రహదారులు చెరువులుగా, బురదగా మారిపోయాయి. వినియోగదారులు మార్కెట్‌కు రాకపోవడంతో వ్యాపారులు డీలా చెందారు. విజయదశమి వేడుకలలో పూజా సామగ్రిదే ప్రధాన పాత్ర, కొబ్బరి కాయలు, అరటిపండ్లు, అరటిమొక్కలు, నిమ్మకాయలు, సిందూరం, వస్త్రాలు, అలంకరణ సామాగ్రి, ఫ్యాన్సీ వస్తువులు, బూడిద గుమ్మడి, దిష్టి సామగ్రి అవసరమవుతాయి. కానీ ఆ దుకాణాల వద్ద కూడా పెద్దగా సందడి లేదు. మధ్యాహ్నం 12 వరకు వాతావరణం పొడిగానే ఉన్నా మార్కెట్లలో వినియోదారులు లేక వెలవెలపోయాయి. తరువాత సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉండటంతో సాయంత్రం వరకు మార్కెట్ డల్‌గానే కనిపించింది.



వర్షం కారణంగా సాయంత్రం తగరపువలస మార్కెట్‌లో దుకాణాల వద్ద కానరాని సందడి

ధరల భారం
యథావిధిగా మార్కెట్‌లో ధరలు మండిపోయాయి. కిలో బంతి పువ్వులు రూ.250, చామంతి రూ.500కు చేరుకున్నాయి. పూలదండలు రూ.300 నుంచి రూ.500 పలికాయి. కొబ్బరి కాయలు సైజును బట్టి రూ.40 నుంచి 60, డజను అరటిపండ్లు రూ.80, డజను నిమ్మకాయలు రూ.20, జీడిపిక్కలు రూ.10కి అమ్ముడుపోయాయి.

ముడుపు సొమ్ము చోరీ

టోల్‌గేట్ కార్యాలయంలో ఘటన

తగరపువలస: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి కోసం పక్కన పెట్టిన సుమారు రూ.లక్ష నగదును చోరీ చేశాడు ఓ ఘనుడు. భీమిలి మండలం బోడమెట్టపాలెం -జొన్నాడ టోల్‌గేట్‌లో గత నెల 30వ తేదీ వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. రాజస్థాన్‌కు చెందిన టోల్‌గేట్ టెండరుదారుడు ప్రతి రోజూ ఒకటో తేదీ నుంచి రోజుకు మూడు షిఫ్ట్‌లలో రూ.వెయ్యి వంతున రోజుకు రూ.3వేలు హుండీలో వేసి నెలాఖరున రూ.లక్ష అయిన తరువాత తిరుపతి వేంకటేశ్వరస్వామి హుండీలో కానుకగా వేస్తుంటారు. అదేవిధంగా సెప్టెంబరు హుండీ ఆదాయాన్ని పక్కన ఉంచారు. అయితే, గుర్తు తెలియని వ్యక్తి, మంగళవారం తెల్లవారుజామున హెల్మెట్ ధరించి ఆఫీసులోకి ప్రవేశించి ఆ నగదు దొంగిలించాడు. టెండరుదారుడి ఫిర్యాదు మేరకు భీమిలి క్రైం పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించి, నగదు రికవరీ చేశారు. ఎస్‌ఐ సూర్యప్రకాష్ నిందితుడిని భీమిలి స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, అక్షింతలు అందజేశారు.

వేములవలసలో ట్రాఫిక్ పద్మవ్యూహం

- అన్నివైపులా మూసుకుపోయిన మార్గాలు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు



వేములవలస నుంచి తగరపువలస వెళ్లే మార్గంలో వాహనాల రద్దీ..



వేములవలస మార్కెట్ వద్ద వాహనాల రద్దీ

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలి పద్మవ్యూహాన్ని తలపించింది. విశాఖ నుంచి వేములవలస, పెందుర్తి నుంచి వేములవలస, వేములవలస నుంచి తగరపువలస వైపు మార్గాలన్నీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారిపోయాయి. దసరా సందర్భంగా ఈ కూడలి ఉదయం నుంచి సాయంత్రం వరకు రష్‌గా కనిపించింది. వర్షం కురిసిన సమయంలో ఇక్కడ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులకు ఫ్లై ఓవర్ కింద రహదారిపైనే తలదాచుకున్నారు. దీంతో పలుమార్లు రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తీవ్రంగా శ్రమించవలసి వచ్చింది. వాహనాల రాకపోకల మార్గాలను కూడలి మీదుగా కాకుండా నేరుగా జాతీయ రహదారి మీదుగా మళ్లించినప్పుడే ట్రాఫిక్ సమస్య తీరుతుందని పలువురు అంటున్నారు.



విశాఖ నుంచి వేములవలస కూడలిలోకి వచ్చే దారిలో నిలిచిపోయిన వాహనాలు